క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన: మండలంలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, స్తంభాల పునరుద్ధరణ పనుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ మంగళవారం తెలిపారు. కాట్రేనికోన, గెద్దనపల్లి, కొప్పిగుంట, నడవపల్లి పల్లంకుర్రు, దొంతికుర్రు, కందికుప్ప, పల్లం, పల్లంకుర్రు గ్రామాలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదని చెప్పారు.

కొబ్బరి బొండాల దుకాణదారులకు కౌన్సిలింగ్



వ్యాపారితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక కంపోస్టు యార్డ్ మీదుగా ఉన్న బైపాస్ రోడ్డు చెంత రాత్రి సమయాల్లో తాగేసిన బొండాలను పడేస్తున్నారు. దీనివల్ల పారిశుధ్య సమస్య జటిలమవుతుందని సాక్షిలో కథనం రావడంతో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు స్పందించి బైపాస్ రోడ్డులో మినీ ప్రొక్లెయిన్‌తో తొలగించిన సంగతి తెలిసిందే. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ నాయుడు పట్టణంలో కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న దుకాణాల వద్దకు మంగళవారం స్వయంగా వెళ్లి వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. తాగేసిన ఖాళీ బొండాలను బైపాస్ రోడ్డు చెంత కాకుండా అక్కడే కొంచెం దగ్గరలో ఉన్న కంపోస్టు యార్డులో పారేస్తే అందరికీ మంచిదని సూచించారు. తీరు మారకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో వార్షికారాధన

తాళ్లరేవు: సమరస నిర్మలానంద శివరామ దీక్షితుల 11వ వార్షికారాధన మహోత్సవం చింతనార్యులు ఆకుల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. తాళ్లరేవు శివారు రంగనాయకపురంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వర్లు స్వగృహంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మేలుకొలుపు, నగర సంకీర్తన, భక్తి గీతాల ఆలాపన నిర్వహించారు. కార్యక్రమంలో వేగాయంపేట పీఠాధిపతులు కొప్పిశెట్టి జగపతి ఆచార్యులు, దంతులూరి జగన్నాథరాజు, బొద్దు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందించాలంటూ ధర్నా

తాళ్లరేవు: వరి చేలకు సాగు నీటిని పూర్తి స్థాయిలో అందించాలని కోరుతూ యానాం –ద్రాక్షరామ రహదారిలోని ఇంజరం తాత్కాలిక వంతెన వద్ద రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఏపీ కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన వంతెన శిథిలస్థితికి చేరుకోవడంతో తూములతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారని, దీని కారణంగానే రైతులకు సాగునీటి సమస్య తలెత్తుతుందన్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వత వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని అక్కడకు చేరుకున్న ఇరిగేషన్ డీఈ హిమరత్న, ఏఈ ఈశ్వర్, ఆర్అండ్‌బీ డీఈఈ డీవీఎస్ వర్మ, ఏఈ లక్ష్మీప్రసన్నలను రైతులు నిలదీశారు. అనంతరం అధికారుల హామీతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోర్త రాజశేఖర్, మండల అధ్యక్షుడు పాలెపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలి

యానాం: పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి చోట మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత ఉందని ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన దత్తత తీసుకున్న గ్రామాలైన అయ్యన్ననగర్, కురసాంపేట ప్రాంతాల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.శ్రీనివాస్, సి.నరేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధాకర్ పాల్గొన్నారు.

పోలీసులను నిలదీసిన బాధితులు

కాట్రేనికోన: బంగారు నగలు చేసిస్తామని మోసగించిన అత్తిలి శ్రీకాంత్, అత్తిలి శ్రీధర్‌లపై పోలీసుల చర్యలు అంతంత మాత్రంగా ఉన్నాయంటూ బాధితులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. కేసు పురోగతిపై పోలీసులను నిలదీశారు. బంగారు నగలు నిమిత్తం దఫాదఫాలుగా సొమ్మును కట్టించుకొని బోర్డు తిప్పేసిన రామలక్ష్మి జ్యూయలర్స్ యాజమానులను పోలీసులు గత నెలలో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఖాతాదారులకు శతగోపం పెట్టిన జ్యూయలరీ వ్యాపారి విషయంలో న్యాయం జరగడం లేదని గతంలో డీఎస్పీని కలిసి సైతం ఫిర్యాదు చేశారు. అయితే ఈ కేసులో పురోగతి లేకపోవడంతో మంగళవారం బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఎస్ఐ టి.శ్రీనివాస్ నిందితులను పిలిచి బుధవారం విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని బాధితులు చెబుతున్నారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు

- ఇంటి ముంగిటకే పథకాలు అందజేత
- వలంటీర్లపై ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు

అమలాపురం టౌన్/ముమ్మిడివరం/అల్లవరం/తాళ్లరేవు/ఉప్పలగుప్తం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. గత టీడీపీ హయాంలో ప్రజలు ప్రభుత్వ పథకాల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి పట్టించారు. అందుకే ప్రజలు ఎవరి దగ్గరికో వెళ్లకుండా ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు వచ్చి చేరాలన్న సదుద్దేశంతో వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారు. సేవే పరమావధిగా భావిస్తున్న వలంటీర్లు నామమాత్రపు గౌరవ వేతనంతో విధులు నిర్వర్తిస్తూ వెలకట్టలేని సేవలను ప్రజలకు అందిస్తున్నారు. అటువంటి వలంటీర్ వ్యవస్థను కించ పరుస్తూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లే కాదు సామాన్య ప్రజలు కూడా భగ్గుమంటున్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి అందించిన సేవలకు వెలకట్టలేమంటున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలన్నీ క్రమం తప్పకుండా అందజేస్తూ వలంటీర్లు తమ కుటుంబ సభ్యుల్లా మారిపోయారని కొనియాడుతున్నారు. సంక్షేమ వారధులుగా వలంటీర్లు అందిస్తున్న సేవలపై సామాన్య ప్రజానీకం వెల్లడిస్తున్న అభిప్రాయాలివి..

సహాయం మరువలేనిది



మా ప్రాంత వలంటీర్ దుప్పి శామ్యూల్‌సాగర్ అందించిన సహాయం మరువలేనిది. ప్రభుత్వం ద్వారా అందించే ప్రతి పథకాన్ని ఎప్పటికప్పుడు మాకు తెలియజేయడంతో పాటు స్వయంగా ఇంటికొచ్చి సంబంధిత పత్రాలను తీసుకెళ్లి సాయం చేస్తారు. మా కుటుంబానికి చేయూత, వాహన మిత్ర, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అందడంతో పాటు విలువైన ఇంటి పట్టా రావడంలోనూ వలంటీర్ సహకరించారు. వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి మాకు ఎంతో మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– మల్లాడి సూర్యకుమారి, పరదేశమ్మ పేట, తాళ్లరేవు

ఇంటి వద్దే లబ్ధి అందుకుంటున్నాం



మా వలంటీర్ ఒకటో తేదీ తెల్లవారకుండానే ఇంటి తలుపు తట్టి నాకు పింఛన్ సొమ్ములు ఇచ్చి వెళతాడు. మా వలంటీర్ ఇంటికొచ్చి మా పిల్లల చేత దరఖాస్తులు చేయించి మా అమ్మాయి, అబ్బాయికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన డబ్బులు వచ్చేలా చేశాడు. నేను వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఆసరా పొందుతున్నానంటే దానికి కూడా అతడే కారణం. కాలు కదపకుండా ఇంటి దగ్గరే ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందుకుంటున్నామంటే వలంటీరే కారణం.

– నక్కిన కృష్ణకుమారి, అమలాపురం పట్టణం

వలంటీర్ సేవలకు వెలకట్టలేం



నాకు కాపు నేస్తం పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వస్తున్నాయి. అందుకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వలంటీర్ ప్రసాద్ తీసుకొచ్చి ఇచ్చారు. అలాగే ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారకముందే నా భర్తకు పింఛనుగా రూ.2,750 తీసుకొచ్చి అందిస్తాడు. రైతు భరోసా రూ.13,000 వస్తున్నాయంటే అది మా వలంటీర్ పుణ్యమే. ఒక్కటేమిటి ప్రభుత్వ పథకాలను మాకు చేరవేయడంలో మా వలంటీర్ అందిస్తున్న సేవలకు వెలకట్టలేం.

– రాయపురెడ్డి గంగాభవాని, లబ్ధిదారు, గాడిలంక

వలంటీర్ సాయం వల్లే పింఛన్



2021లో నాకు పింఛన్‌కు అర్హత రావడంతో ఈకేవైసీ చేయాల్సి వచ్చింది. అప్పుడు నేను అనారోగ్యంతో విశాఖపట్నంలోని మా అమ్మాయి ఇంటి వద్ద ఉండి చికిత్స పొందుతున్నాను. మా వలంటీర్ నందింకం స్వామి అక్కడికే వచ్చి వేలిముద్రలు తీసుకోవడంతో నాకు పింఛన్ మంజూరైంది. ఆ రోజు వలంటీర్ చేసిన సాయం ఇప్పటికీ నాకు ఎంతో ఉపయోగపడుతుంది.

– సీతాదేవి, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

వరదలొచ్చినపుడు భరోసా కల్పించారు



గతేడాది మా ఊరికి వరదొచ్చి మత్స్యకార కాలనీ ముంపునకు గురైనప్పుడు వలంటీరు రమ్య వచ్చి గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను దగ్గరుండి మరీ పునరావాస కేంద్రాలకు తరలించింది. ముంపు ఉన్నంతకాలం మాకు భరోసాగా ఆమె సేవలందించారు. ఆ ఒక్క సందర్భంలోనే కాదు కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రోగులకు సేవలందించారు. ఆమె సేవలను మేము ఎప్పటికీ మరిచిపోలేం.

– ఓలేటి పరమేశ్వరరావు, బోడసకుర్రు పల్లిపాలెం, అల్లవరం మండలం

సురక్ష సర్టిఫికెట్లతో సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



జార్జిపేటలో మహిళకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

అల్లవరం: అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి నూరు శాతం సంక్షేమ పథకాలు వర్తింపచేయడమే లక్ష్యంగా జగనన్న సురక్ష సర్టిఫికెట్‌లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. ఎస్.పల్లిపాలెంలో సర్పంచ్ కొల్లు వెంకట రమణ, గుండెపూడిలో సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎస్.పల్లిపాలెంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ నాగేశ్వరారావు, కొపనాతి వెంకటేశ్వరరావు, పినిపే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: నూరు శాతం సంక్షేమం సాధించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తుందని ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌లు అన్నారు. మంగళవారం జార్జిపేట పంచాయతీలో స్థానిక వేణుగోపాలస్వామివారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 350 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్ పేర్ని ఆదినారాయణమూర్తి, ఎంపీడీఓ ఎం.అనుపమ, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నాగేశ్వరరావు, పెట్ల శాంతకుమారి, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డి.రాంబాబు అన్నారు. మంగళవారం కేశనకుర్రు సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ బీర సత్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. 1,568 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సొసైటీ అధ్యక్షుడు ఇందుకూరి రంగరాజు, పిన్నంరాజు పెదబాబు, మోకా రవి, కాశి పరివాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం

ముమ్మిడివరం: ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు మొదటి ప్రాధాన్యమివ్వాలని ప్రాజెక్టు అధికారి ఎ.మధుసూదన్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని అనాతవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల స్థితిగతులపై ఆరా తీశారు. వలసలు నివారించాలంటే ఉపాధి పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు మొదటి ప్రాధాన్యమివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆయన వెంట ఏపీఓలు బి.చంద్రమోహన్, బి.వెంకటలక్ష్మి, ఎం.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్
- వన్నెచింతలపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



వన్నెచింతలపూడిలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను అందజేస్తున్న డాక్టర్ పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. వన్నెచింతలపూడి గ్రామంలో బుధవారం ఆయన మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఇంటి రుణాలు, ఇళ్ల స్థలాల కోసం పలువురు ఆయనకు విన్నివించుకున్నారు. అంబేడ్కర్ నగర్, జైభీమ్‌నగర్‌ల్లో ఉన్న శ్మశాన వాటికకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఎంపీటీసీ పరమట నాగమణి, సర్పంచ్‌లు రేలంగి దుర్గరావు, పొనకల గణేష్, మాజీ సర్పంచ్ మోహన్ కుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పరమట గోపాలరావు, కుంచే వెంకటేశ్వరరావు, మోర్త రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిది ఆత్మహత్యాయత్నం కాదు



గొల్లవిల్లిలో బాలికల వసతి గృహంలో వివరాలు తెలుసుకుంటున్న పీడీఎస్‌యూ నాయకులు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆదివారం సాయంత్రం వివిధ రకాల ట్యాబెట్లు మింగడంతో పాటు చెయ్యి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందంటూ స్థానికంగా వార్తలు హల్‌చల్ చేశాయి. అయితే అధికారులు మాత్రం హాస్టల్‌లో అసలు ఆత్మహత్యాయత్నమే జరగలేదని, అవన్నీ పుకార్లేనని స్పష్టం చేశారు. స్థానికంగా వచ్చిన వార్తలతో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, పీడీఎస్‌యూ నాయకులు మంగళవారం హాస్టల్‌కు వెళ్లి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటి విద్యార్థినులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వార్డెన్ పర్యవేక్షణతో హాస్టల్లో భద్రత కరవైందని, రాత్రివేళల్లో హాస్టల్‌లోకి అబ్బాయిలు చొరబడుతున్నారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థినుల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్న వార్డెన్, సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికారిక అధికారిణి జ్యోతిలక్ష్మీదేవి మాట్లాడుతూ బాలిక కడుపునొప్పి భరించలేక రెండు పారాసిట్మాల్ టాబ్లెట్లు వేసుకుందే తప్ప ఎలాంటి ఆత్మహత్యాయత్నం జరగలేదని చెప్పారు. దీనిపై అమలాపురం సాంఘిక సంక్షేమ అధికారిని అక్కడకు పంపించి విచారణ జరిపించామన్నారు. పీడీఎస్‌యూ నాయకుల ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం

- పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మల దహనం
- బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్



అమలాపురంలో పవన్‌కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



కామనగరువులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వలంటీర్లు



గుడ్డివానిచింత వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

అమలాపురం టౌన్: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌పై అమలాపురంలో వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక 12వ వార్డు సచివాలయం ఎదుట మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, 24వ వార్డు కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ధర్నాలో పవన్ కళ్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు.

అమలాపురం పట్టణం మద్దాలవారి పేట వార్డు సచివాలయం ఎదుట వలంటీర్లు ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు గోపీ రాజీ, చిత్రపు రామకృష్ణ, యన్నాబత్తుల పద్మ, యండమూరి గంగ, బండారు గోవిందు ఈ ధర్నాల్లో పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం రూరల్: వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కామనగరువులో మంగళవారం సాయంత్రం వలంటీర్లు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సర్పంచ్ నక్కా అరుణకుమారి, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు రాజులపూడి మురళీకృష్ణ, ఉపసర్పంచ్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పేరూరులో నాలుగు సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


అల్లవరం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్ తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని అల్లవరం మండల వలంటీర్ల అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్ మాటలకు నిరసనగా గుడ్డివానిచింత వద్ద ధర్నా నిర్వహించారు. వలంటీర్లు చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థపై చవకబారు మాటలను మానుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో విశిష్ట సేవలందించిన వలంటీర్లను దేశవ్యాప్తంగా కీర్తించారని ఇజ్రాయిల్ అన్నారు. అనంతరం పవన్‌కల్యాణ్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని అల్లవరం ఎస్ఐ శ్రీనునాయక్‌కి వలంటీర్లు ఫిర్యాదు చేశారు.

తాళ్లరేవు: పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వలంటీర్లు తాళ్లరేవులో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి సంతపేట సెంటర్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. పవన్‌కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మానవహారం నిర్వహించి పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పవన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ చింతా మోహనకృష్ణ, కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వలంటీర్లకు మద్దతుగా ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మహిళలు అక్రమ రవాణాకు, అమ్మాయిల అదృశ్యానికి వలంటీర్లు కారణమంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై గ్రామ వలంటీర్లు భగ్గుమన్నారు. ఐ.పోలవరం మండలంలోని 14 గ్రామ పంచాయతీల వలంటీర్లు మురమళ్ల గ్రామ సచివాలయం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా మార్కెట్ సెంటరుకు నిరసన తెలియజేస్తూ వెళ్లారు. 216 జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి, పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ కాశే రాజుబాబు, ఏలూరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ పోతురాజుకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు



మురమళ్లలో నిరసన ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

కాట్రేనికోన: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాట్రేనికోన గేటు సెంటరు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. ముందుగా గేటు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం మానవహారం చేపట్టారు. రూ.5 వేలు గౌరవ వేతనం తీసుకుంటూ ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లు సంఘ విద్రోహక శక్తులుగా కనబడుతున్నారా అంటూ పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. పవన్‌ను తక్షణమే అరెస్టు చేయాలనే డిమాండ్‌తో వినతిపత్రాన్ని కాట్రేనికోన తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో అవకతవకలు



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలో శ్మశాన వాటిక, కంపోస్టు యార్డ్‌లకు వెళ్లేందుకు వీలుగా రూ.40 లక్షల ఖర్చుతో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆరోపించారు. సదరు రోడ్డును మంగళవారం ఆయన స్వయంగా పరిశీలించి నిర్మాణంలో నాణ్యత లోపాలను గుర్తించినట్లు చెప్పారు. మంత్రి పినిపే విశ్వరూప్ ఓ మంచి ఉద్దేశంతో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడితే నాణ్యత లోపాలతో నిర్మింస్తుండడం బాధాకరమన్నారు. పాలక పక్ష కౌన్సిలర్లతో లోపాలపై మాట్లాడి వచ్చే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తామని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తెలిపారు.

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

యానాం: బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్ఏఓ ఆఫీసు సమీపంలో పలువురు యానాం కోపరేటివ్ స్టోర్స్ సేల్స్‌మెన్స్ సిబ్బంది రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 30 నెలలుగా జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల కోసం గత కొన్ని నెలలుగా పుదుచ్చేరిలోని అధికారుల వద్దకు, మంత్రుల వద్దకు తిరిగామని అయినా జీతాలు చెల్లించలేదన్నారు. సేల్స్‌మెన్ కమ్ హెల్పర్స్‌గా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్ తదితరులు దీక్షా శిబిరం వద్ద ఆందోళనకారులకు మద్దతు పలికారు.

స్థూపంపై అభ్యంతరం



దుకాణాలకు ఎదురుగా నిర్మించిన టీడీపీ జెండా స్థూపం

అమలాపురం టౌన్: స్థానిక కాలేజీ రోడ్డులో ఉన్న పాలెపు రామచంద్ర టవర్స్(అపార్ట్‌మెంట్) గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న దుకాణాలకు ఎదురుగా దారికి అడ్డంగా టీడీపీ జెండా స్థూపాన్ని నిర్మించడంపై వ్యాపారులు అభ్యంతరం చెప్పారు. టీడీపీ బస్సు యాత్ర సందర్భంగా రాత్రికి రాత్రే ఈ జెండా స్థూపాన్ని నిర్మించారని ఆ దుకాణాల యాజమానులు చెబుతున్నారు. దారికి అడ్డంగా నిర్మించిన స్థూపాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: నీట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్ తదితర మెడికల్ కోర్సులు అభ్యసించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంటాక్ అడిషనల్ కోఆర్డినేటర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 12 నుంచి స్వీకరిస్తారని ఈ నెల 18తో గడువు ముగుస్తుందన్నారు.

వేలం పాట నిలిపేయాలి

ఐ.పోలవరం: అన్నవరం కొండపై శుభకార్యాలు చేసుకునేందుకు పురోహితులను సరఫరా చేసేందుకు దేవస్థాన అధికారులు తలపెట్టిన బహిరంగ వేలం పాటను తక్షణమే నిలుపుదల చేయాలని బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి నాగాభట్ల రవిశర్మ డిమాండ్ చేశారు. మురమళ్లలో ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేవలం ధనార్జన కోసం పెట్టిన ఈ వేలం పాట నిలిపేయాలని, పురోహితులను ఇబ్బంది పెట్టే ఆలోచనలు మానుకోవాలని చెప్పారు.

బస్టాండుల్లో లీజుకు ఖాళీ స్థలాలు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని ముమ్మిడివరం, అంబాజీ పేట బస్టాండుల్లో ఉన్న ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు అద్దె ప్రాతిపదికన లీజుకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ముమ్మిడివరం బస్టాండ్ ఆవరణలో ఉన్న 2162 చదరపు గజాలు, 1751 చదరపు గజాలతో పాటు అంబాజీపేట బస్టాండ్ ఆవరణలో ఉన్న 2730 చదరపు గజాల ఖాళీ స్థలాలకు టెండరు నిర్వహిస్తామన్నారు. టెండర్ ఫారాలు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని విజయవాడ ఈడీ ఆఫీసులో ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు సమర్పించాలన్నారు. అదే రోజు 3 గంటలకు టెండర్లు తెరుస్తారని చెప్పారు.

15 మంది జనసేన నేతల అరెస్ట్

అమలాపురం టౌన్: అమలాపురం గడియారం స్తంభం సెంటరులో జనసేన పార్టీ నాయకులు సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నాలను పోలీసులు మంగళవారం ఉదయం అడ్డుకున్నారు. పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి, పట్టణ ఎస్ఐలు హరీష్‌కుమార్, ప్రభాకర్‌లు రంగంలోకి దిగి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు సహా 15 మంది పార్టీ నాయకులను అరెస్ట్ చేసి కొంతసేపటి తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

టీడీపీ బస్సు యాత్ర

సాక్షి, అమలాపురం: టీడీపీ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్ర నియోజకవర్గ పరిధిలో మంగళవారం జరిగింది. భట్నవిల్లి నుంచి పట్టణంలో పలు వీధుల మీదుగా ఈ బస్సు యాత్ర సాగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, నిమ్మల రామానాయుడు, వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనకు చరమ గీతం పాడాల్సిన అవసరముందన్నారు.